# వడ్డీ రేట్లు తగ్గించం

- ద్రవ్యోల్బణం అదుపే మా ప్రాధాన్యత
- ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్
- పాలసీ సమీక్ష సందర్భంగా వ్యాఖ్యలు

ముంబై, డిసెంబర్ 8: ధరల్ని అదుపు చేయడమే తమ ప్రాధాన్యం అయినందున, ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గించే యోచన లేదని రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ కుండబద్దలు కొట్టారు. శుక్రవారం ఆర్బీఐ పాలసీ సమీక్ష ముగిసిన అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ కొద్ది నెలలుగా ద్రవ్యోల్బణం గణాంకాలు సంతృప్తికరంగా ఉన్నాయని, అక్టోబర్‌లో ఇది 4.87 శాతానికి దిగివచ్చినంత మాత్రాన రేట్ల తగ్గింపునకు ఏ మాత్రం తొందరపడేది లేదంటూ పరోక్ష సంకేతాలు ఇచ్చారు. ద్రవ్యోల్బణం నిర్వహణలో చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని దాస్ చెప్పారు. ఆర్థిక వ్యవస్థకు ఏదో ఒక షాక్ తగిలే అవకాశం ఉన్నందున ఆర్బీఐ భవిష్యత్ పాలసీ ఎలా ఉంటుందన్న అంచనాల్ని వెల్లడించడం కష్టసాధ్యమని, భవిష్యత్ 'చాలా అనిశ్చితం'గా ఉందని వ్యాఖ్యానించారు.



శుక్రవారం ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన పరపతి సమీక్ష సమావేశానికి హాజరైన ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, డిప్యూటీ గవర్నర్లు మైకేల్ దేవవ్రత పాత్రా, ఎం రాజేశ్వర్ రావు, స్వామినాథన్ జానకీరామన్, టీ రవి శంకర్

### ఐదోసారి కీలక రేట్లు యథాతథం

బ్యాంక్‌ల వడ్డీ రేట్లను ప్రభావితం చేసే కీలక రేట్లను ఆర్బీఐ యథాతథంగా అట్టిపెట్టింది. ద్రవ్యోల్బణంపై నెలకొన్న అనిశ్చితి, వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మూడు రోజుల పాటు ద్రవ్య విధాన సమీక్షను నిర్వహించిన ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) రెపో రేటును 6.5 శాతం వద్దే అట్టిపెట్టాలని నిర్ణయించింది. ఎస్‌డీఎఫ్ రేటు 6.25 శాతం వద్ద, ఎంఎస్‌ఎఫ్ రేటు 6.75 శాతం వద్దే కొనసాగించనున్నట్టు కమిటీ నిర్ణయాల్ని గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడించారు. అధిక వడ్డీ రేట్లు ఎక్కువకాలం ఉంటాయనడానికి సంకేతంగా 'అకామిడేటివ్ స్టాన్స్'ను ఉపసంహరించేందుకు మెజారిటీ కమిటీ సభ్యులు ఓటు చేశారు. ఆరుగురు సభ్యులు గల కమిటీలో ముగ్గురు ఆర్బీఐ అధికారులు కాగా, మరో ముగ్గురు కేంద్ర ఆర్థిక శాఖ నియమించిన నిపుణులు ఉంటారు. రేటు రేటును 2022 మే నుంచి వరుసగా 250 బేసిస్ పాయింట్లు (2.5 శాతం) పెంచిన ఆర్బీఐ ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి యథాతథ స్థితిని కొనసాగిస్తున్నది.

### జీడీపీ వృద్ధి అంచనా పెంపు

పూర్తి ఆర్థిక సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి అంచనాల్ని ఆర్బీఐ పెంచింది. గత సమీక్షలో 6.5 శాతం వృద్ధిని అంచనావేయగా, తాజాగా దీనిని 7 శాతానికి పెంచింది. జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ అంచనాల్ని మించి 7.6 శాతం వృద్ధిచెందిన సంగతి తెలిసిందే. వృద్ధి జోరుగా ఉన్నదని, అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నదని శక్తికాంత్‌దాస్ వ్యాఖ్యానించారు. తయారీ పీఎంఐ విస్తరించడం, ఎనిమిది కీలక రంగాలు ఆరోగ్యకరంగా వృద్ధి చెందడం ప్రోత్సాహక సంకేతాలని అన్నారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ పట్ల విదేశీ ఇన్వెస్టర్లు, రెగ్యులేటర్లకు విశ్వాసం పెరుగుతున్నదని వెల్లడించారు.

### ద్రవ్యోల్బణం అంచనా 5.4 శాతం

జీడీపీ వృద్ధి అంచనాల్ని పెంచిన ఆర్బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం ఉంటుందని అంచనా వేసింది. ఇటీవల కమోడిటీ ద్రవ్యోల్బణం తగ్గినందున అక్టోబర్‌లో 4.7 శాతానికి దిగివచ్చినప్పటికీ, ఆహార ద్రవ్యోల్బణం రిస్క్‌లు పొంచివున్నాయని, నవంబర్, డిసెంబర్‌లో ఇది పెరగవచ్చని భావిస్తున్నట్టు ఆర్బీఐ గవర్నర్ చెప్పారు. అనిశ్చిత ఆహారోత్పత్తుల ధరలు, అంతర్జాతీయంగా చక్కెర ధరలు పెరగడం ఆందోళనకరమని అన్నారు. ధరలపై మరో రౌండు ప్రభావం ఏమైనా ఉంటుందా అనే అంశాన్ని జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉందని, ఈ కారణంగానే వినిమయ ద్రవ్యోల్బణం గత అంచనాల్నే కొనసాగిస్తున్నామన్నారు.



## ఎవరేమన్నారు..

ఆర్బీఐ నిర్ణయాలు బ్యాంకింగ్ ఫండ్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపర్చేలా ఉన్నాయి. ముఖ్యంగా ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ కోసం యూపీఐ లావాదేవీలకున్న పరిమితిని పెంచడాన్ని స్వాగతిస్తున్నాం. వృద్ధిరేటు పెరుగవచ్చన్న అంచనా.. రాబోయే కొత్త సంవత్సరానికి శుభ సంకేతం.

**-దినేశ్ ఖారా, ఎస్బీఐ చైర్మన్**

రెపోరేటును ఈసారీ యథాతథంగానే ఉంచాలని నిర్ణయించడం సంతోషకరం. ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయాలు.. దేశ ఆర్థిక సుస్థిరతకు దోహదం చేస్తున్నాయి. ప్రధానంగా మదుపరులు, రుణగ్రహీతలు, వినియోగదారుల్లో క్రెడిట్ పాలసీపై నమ్మకాన్ని పెంచుతున్నాయి.

**-దీపక్ సూద్,**
**అసోచామ్ ప్రధాన కార్యదర్శి**

వడ్డీరేట్లు తగ్గితే దేశ ఆర్థిక వ్యవస్థకు, రియల్ ఎస్టేట్ పరిశ్రమకూ లాభిస్తుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుండటం, ఊహించిన దానికంటే జీడీపీలో వృద్ధి కనిపిస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. పరిస్థితులు ఇలాగే ఉంటే రెపోరేటు త్వరలోనే తగ్గవచ్చు.

**-బొమన్ ఇరానీ,**
**క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు**




## 70 వేల దిశగా సెన్సెక్స్

ముంబై, డిసెంబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల జైత్రయాత్ర కొనసాగుతున్నది. ప్రస్తుతేడాదిలో జీడీపీ వృద్ధి అంచనాను పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయం మార్కెట్లకు ఉత్సాహాన్ని ఇచ్చింది. వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ తీసుకున్న నిర్ణయంతో బ్యాంకింగ్, వడ్డీరేట్లకు సంబంధించిన షేర్లు కదంతొక్కాయి. దీంతో సూచీలు మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 303.91 పాయింట్లు అందుకొని నూతన గరిష్ఠ స్థాయి 69,825.60 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 69,894 పాయింట్లను తచ్చాడిన సూచీ త్వరలో 70 వేల మార్క్‌ను అధిగమించే అవకాశాలున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. అలాగే మరో సూచీ నిఫ్టీ సైతం 68.25 పాయింట్లు అందుకొని 20,969.40 వద్ద ముగిసింది.

### హెచ్‌సీఎల్ టాప్ గెయినర్..

దేశీయ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్నాలజీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కంపెనీ షేరు 2.69 శాతం లాభపడింది. దీంతోపాటు జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు కూడా లాభాల్లో ముగిశాయి. కానీ, ఐటీసీ, మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ, టెక్, బ్యాంకింగ్ రంగ సూచీలు ఒక్క శాతం వరకు లాభపడగా, యుటిలిటీ, పవర్, ఎఫ్‌ఎంసీజీ, టెలి కమ్యూనికేషన్స్, ఆటో రంగ సూచీలు పడిపోయాయి.

## 83.40 వద్దకు రుపీ



ముంబై, డిసెంబర్ 8: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మరో 4 పైసలు పడిపోయింది. దీంతో శుక్రవారం ఫారెక్స్ ట్రేడింగ్‌లో 83.40 వద్ద భారత కరెన్సీ నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలో అమెరికా కరెన్సీ బలపడటం, ముడి చమురు ధరలు మళ్లీ పుంజుకుంటుండటం.. రూపాయిని దెబ్బ తీస్తున్నాయని ఫారెక్స్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. కాగా, ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ వద్ద రూపాయి మారకం విలువ 83.35 దగ్గర మొదలై, 83.40 వద్ద ముగిసింది. గురువారం కూడా రూపాయి విలువ 4 పైసలు దిగజారి 83.46 వద్ద స్థిరపడిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వైఖరితో సమీప భవిష్యత్తులో రూపాయి పుంజుకోవచ్చన్న అంచనాల్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. రికార్డు స్థాయి లాభాల్లో ట్రేడ్ అవుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా రుపీని బలపర్చగలవని చెప్తున్నారు.

## అన్‌లిమిటెడ్‌లో 50 శాతం రాయితీ




న్యూఢిల్లీ, డిసెంబర్ 8:దేశంలో అతిపెద్ద ఫ్యాషన్ దుస్తుల విక్రయ సంస్థ 'అన్‌లిమిటెడ్'తాజాగా రెడ్ అలర్ట్ సేల్ పేరుతో ప్రత్యేకంగా 50 శాతం రాయితీ అందిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఆఫర్ జనవరి 1 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న 87 అన్‌లిమిటెడ్ అవుట్‌లెట్లలో ఈ ఆఫర్ ఉంటుందని ఒక ప్రకటనలో వెల్లడించింది.

## 600 బిలియన్ డాలర్ల పైకి మారకం నిల్వలు

విదేశీ మారకం నిల్వలు మళ్లీ పుంజుకున్నాయి. నాలుగు నెలల తర్వాత మళ్లీ 600 బిలియన్ డాలర్ల మార్క్‌ను అధిగమించాయి. డిసెంబర్ 1 నాటికి ఫారెక్స్ నిల్వలు 604 బిలియన్ డాలర్లుగా నమోదైనట్టు రిజర్వ్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు 11న 600 బిలియన్ డాలర్లకు దిగువకు పడిపోయిన తర్వాత మళ్లీ ఇప్పుడే అధిగమించాయి. మరోవైపు, అక్టోబర్ 2021లో రికార్డు స్థాయి 642 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీ కంటే రూపాయి చాలా బలహీనంగా ఉన్నప్పటికీ స్థిరంగా కొనసాగుతున్నదని, దేశ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం కారణమని దాస్ వెల్లడించారు.




## ఇక రూ.5 లక్షలదాకా..

**దవాఖానలు, విద్యా సంస్థలకు యూపీఐ ద్వారా చేసే చెల్లింపుల పరిమితి పెంపు**

ముంబై, డిసెంబర్ 8: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా ద్వైమాసిక ద్రవ్య సమీక్షలో ఓ కీలక నిర్ణయం తీసుకున్నది. దవాఖానలు, విద్యా సంస్థలకు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చేసే చెల్లింపులకున్న పరిమితిని రూ.5 లక్షల దాకా పెంచుతున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం ఇది లక్ష రూపాయలుగానే ఉండటం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) ఐదో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష బుధవారం మొదలై మూడు రోజులు కొనసాగింది. ఇందులోని నిర్ణయాలను శుక్రవారం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ఈ క్రమంలోనే యూపీఐ లావాదేవీలకు సంబంధించి ఉన్న వివిధ రకాల పరిమితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు తెలిపారు. ఇందులోభాగంగానే ఇప్పుడు 'హాస్పిటల్స్, ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ కోసం యూపీఐ లావాదేవీలకున్న పరిమితిని లక్ష రూపాయల నుంచి 5 లక్షల రూపాయలదాకా పెంచుతున్నాం' అని ప్రకటించారు. విద్య, వైద్య అవసరాల కోసం యూపీఐ చెల్లింపులు జరిపే కస్టమర్లకు మా నిర్ణయం ఉపయుక్తంగా ఉండగలదన్న ఆశాభావాన్ని దాస్ వ్యక్తం చేశారు.

### ఈ–మ్యాండేట్స్‌పై..

రికరింగ్ పేమెంట్స్ కోసం ఈ–మ్యాండేట్స్ (మానవ జోక్యం లేని డిజిటల్ పేమెంట్ సర్వీస్)కున్న పరిమితిని కూడా లక్ష రూపాయలకు ఆర్బీఐ పెంచింది. ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.15,000 నుంచి లక్షకు పెంచుతున్నామని దాస్ స్పష్టం చేశారు. దీంతో ఇకపై మ్యూచువల్ ఫండ్, ఇన్సూరెన్స్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్స్, క్రెడిట్ కార్డ్ బకాయిల రికరింగ్ పేమెంట్స్ మరింత సులభతరం అవుతాయని వివరించారు. కాగా,ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్‌కు మద్దతునిచ్చేలా ఈ రంగంలో వచ్చే మార్పులపై అవగాహనను పెంచేలా ఫిన్‌టెక్ రెపాజిటరీని ఏర్పాటు చేస్తామని దాస్ ప్రకటించారు.

## నన్ను గవర్నర్ అంటే చాలు..

నన్ను కేవలం 'గవర్నర్' అని పిలిస్తే చాలని, 'గౌరవనీయులైన గవర్నర్' అని పిలవనక్కర్లేదని శక్తికాంత దాస్ అన్నారు. శుక్రవారం ద్రవ్యసమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓ ఆర్బీఐ సభ్యుడు దాస్‌నుద్దేశించి మాట్లాడుతూ 'గౌరవనీయులైన గవర్నర్' అని సంబోధించారు. ఈ క్రమంలోనే దాస్ పైవిధంగా స్పందించారు. అయితే ప్రధాని మోదీ సైతం తనను మోదీ అంటే చాలని, మోదీజీ అని గౌరవసూచక పదాలేవీ వాడొద్దని అందరికీ విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో దాస్ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ఇక త్వరలోనే దాస్.. ఆర్బీఐ గవర్నర్‌గా ఐదేండ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్నారు. మూడేండ్ల తొలి విడుత ముగియడంతో మళ్లీ ఆయన్నే కేంద్రం కొనసాగిస్తున్నది. ఉర్జిత్ పటేల్ రాజీనామాతో దాస్ ఆర్బీఐ గవర్నర్‌గా వచ్చినది తెలిసిందే.

